క్లుప్తంగా

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేసేది బీఆర్‌ఎస్ పార్టీనని నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతా రెడ్డి అన్నారు. ఆమె ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలసి మంగళవారం చాముండేశ్వరి అమ్మవారికి పూజలు చేసి, మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం ప్రారంభించారు.

మహిళా ఓటర్లే కీలకం

చిన్నశంకరంపేట(మెదక్): మండలం కేంద్రం చిన్నశంకరంపేటలో మహిళా ఓటర్లు కీలకంగా మారనున్నారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో 40 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మండలంలో మహిళా ఓటర్లు 15410 మంది ఉన్నారు. పురుషులు 14544 మంది ఓటర్లు ఉండగా, మొత్తం 30,205 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నాయని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని నడిమితండా, చిల్వెర, ముప్పారం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపీడీఓ శంకర్ పరిశీలించారు. కేంద్రాల్లో తాగు నీరు, విద్యుత్, మౌళిక సదుపాయాలు తెలుసుకున్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ చెప్పారు. ఆయన వెంట ఎంపీఓ సయ్యద్, పీఆర్ ఏఈ విజయ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

వాహనం తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద బీజేపీ అభ్యర్థి పంజా విజయ్ వహనం తనిఖీ చేశారు. మంగళవారం మెదక్ – చేగుంట ప్రధాన రహదారిపై వచ్చిపోయో వహనాలను ఎన్నికల బృందం (ఎస్‌ఎస్‌సీ టీం) అధికారులు తనిఖీలు నిర్వహించి వివరాలు నమోదు చేశారు. ఇదే సమయంలో వచ్చిన బీజేపీ అభ్యర్థి పంజా విజయ్ వహనాన్ని తనిఖీ నిర్వహించారు.

ప్రధాని సభకు తరలిన బీజేపీ నాయకులు

చేగుంట(తూప్రాన్): మండలంలోని బీజేపీ నాయకులు హైదరాబాద్ ప్రధాని నరేంద్రమోదీ సభకు తరలి వెళ్లారు. మంగళవారం దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు నామినేషన్ కార్యక్రమానికి వెళ్లి అనంతరం హైదరాబద్ ప్రధాని సభకు తరలి వెళ్లినట్లు నియోజకవర్గ సమన్వయ కర్త వెంగళ్‌రావు తెలిపారు.

రాజీనామా

రేగోడ్(మెదక్): మండలంలోని ఆర్.ఇటిక్యాలలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. తాజాగా మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ రైతు సమన్వయ సమితి గ్రామ అధ్యక్షుడు కాశీనాథ్ స్వామి, బీజేపీలకు పలువురు రాజీనామా చేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో సుమారు 15 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రాజేందర్ పాటిల్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఈశ్వరప్ప, యూత్ నాయకుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నిజాంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన నిజాంపేట మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లాకు చెందిన యువకూలీ అనంతయ్య (20) నిజాంపేటలో తెల్లవారు జామున పని చేస్తున్న కూలీ అనంతయ్యను మట్టి లోడుతో వస్తున్న లారీ ఢీకొనగా అక్కడిక్కడే మృతిచెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సాయం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేటలో గాండ్ల లక్ష్మయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో మంగళవారం కాంగ్రెస్ నాయకులు గాలి అనీల్‌కుమార్ రూ. 10వేలు ఆర్థికసాయం చేశారు. ఆయన తరఫున బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకులు లింగం, పాషా, ప్రభు, సత్యనారాయణ, పద్మారావు, అరవింద్ తదితరులు అందజేశారు.



నర్సాపూర్ రాయరావు చెరువుకట్టపై ఎండుతున్న మొక్కలు

నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యాలు

ఎండుతున్న మొక్కలు

నర్సాపూర్ రూరల్: ఓ వైపు ఎండుతున్న మొక్కలు.. మరోవైపు మొక్కలు నాటేందుకు తీసిన గోతులు ఇవి అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంగా కనిపిస్తున్నాయి. నర్సాపూర్ పట్టణంలో కాగజ్ మద్దూర్ రోడ్డు నుంచి రాయరావు చెరువు కట్టపైకి వెళ్లే దారిలో హరితహారం మొక్కలు నాటేందుకు రోడ్డుకు ఇరువైపులా గోతులు తీసి వదిలేశారు. అలాగే నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు రాయరావు చెరువు కట్టపై ఎండుతున్నాయి.



లింగమయ్య ఆలయ సమీపంలో మొక్కలు నాటేందుకు తీసిన గుంతలు

శ్మశానవాటికలో ముళ్ల పొదల తొలగింపు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలోని శ్మశాన వాటిక చుట్టూ పరిసరాల్లో ఉన్న ముళ్ల పొదలను గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎంప్లాయ్ మామిళ్ల నర్సింలు తన సొంత ఖర్చులతో తొలగించారు. మంగళవారం గ్రామంలోని శ్మశానవాటికకు వేళ్లేందుకు ముళ్ల పొదలు ఉండడంతో అక్కడ నడవడం ఇబ్బందిగా ఉండేది. ఈ విషయం తెలుసుకున్న నర్సింలు జేసీబీ సహాయంతో వాటిని తొలగించి, ఆవరణ పరిశుభ్రం చేయించారు. ఈ కార్యక్రమంలో మండల ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షుడు నర్సింలు, సాయిబాబా, మల్లేశం, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



ముళ్ల పొదలు తొలగిస్తున్న నర్సింలు

బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పండి

- కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): గత ఎన్నికలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని కూకుట్లపల్లి, భుజిరంపేట, వెంకటాపూర్, మనంతయపల్లి తండా, పీర్యతండా, మహ్మద్‌నగర్ తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రుణమాఫీ, డబుల్‌బెడ్రూం తదితర హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. అనంతరం ఫైజాబాద్, మహ్మద్‌నగర్‌లో పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో సుహాసినిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు రఘు, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, నాయకులు పాషా, పోచయ్య, రమేశ్, గోపాల్, ప్రవీన్‌రెడ్డి, ప్రవీణ్, రాములు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): అందోల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి దామోదర రాజనర్సింహను గెలిపించాలని మంగళవారం మండల కేంద్రం టేక్మాల్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింట ప్రచారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు మాన్‌కిషన్, సుధాకర్, మజహర్, రాజు, పాపయ్య, కిషోర్, సాగర్, సేవ్యా నాయక్, శివమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మెదక్: పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బట్టి సులోచన మంగళవారం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆమె ఆరోపించారు.

కేసీఆర్‌కు హ్యాట్రిక్ ఖాయం

మనోహరాబాద్(తూప్రాన్): కేసీఆర్‌కు గజ్వేల్‌లో హ్యాట్రిక్ ఖాయమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేశ్ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండల కేంద్రంలో వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నరేందర్‌రెడ్డి, నాయకులు రవి, వెంకటేశ్‌గౌడ్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, సాయి, భిక్షపతి, శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు.

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలో దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఎంపీపీ శ్రీనివాస్, జెడ్పీటీసీ శ్రీనివాస్, నాయకులు రాజిరెడ్డి, నారాయణరెడ్డి, పలు గ్రామాల బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టేక్మాల్(మెదక్): అందోల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి క్రాంతికిరణ్‌ను గెలిపించాలని మండలంలోని కుసంగి గ్రామంలో నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. ఇందులో పార్టీ మండలాధ్యక్షుడు వీరప్ప, నాయకులు విక్రంగౌడ్, భాస్కర్, సిద్ధయ్య, అవినాశ్, మహేందర్, మల్లయ్య పాల్గొన్నారు.

కోడి పందేల ముఠా అరెస్టు

- 27 మంది పై కేసు నమోదు
- 8 పందెం కోళ్ళు
- రూ.2.27 లక్షలు స్వాధీనం

మెదక్ మున్సిపాలిటీ: మెదక్‌లో పందెం కోళ్ల ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు మంగళవారం సీఐ వెంకటేశ్ వివరాలు తెలిపారు. నర్సిఖేడ్ శివారులో కొంత మంది కోళ్ల పందేలు ఆడుతున్నారనే స్థానికులు ఇచ్చిన సమాచారంతో అక్కడికి చేరి దాడి చేశామన్నారు. పందేలు ఆడుతున్న 27 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 8 పందెం కోళ్ళు, రూ.2,62,130 నగదు స్వాధీం చేసుకున్నామని చెప్పారు. అదుపులోకి తీసుకున్న వారిని స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలి

రామాయంపేట(మెదక్): కత్తిపోట్లకు గురైన దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని నార్సింగి జడ్పీటీసీ కృష్ణారెడ్డి కోరారు. నార్సింగిలో మంగళవారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో ఉన్న ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా గ్రామాల్లో ఇంటింటికి ప్రచారం నిర్వహించాలని సూచించారు. దుబ్బాక నుంచి ఎమ్మెల్యే రఘునందన్‌రావు అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, ఈ ఎన్నికల్లో ఆయన ఓటమి తథ్యమని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. 70 నుంచి 75 సీట్లతో బీఆర్‌ఎస్ అధికాంలోకి వస్తుందని అన్ని సర్వేలు స్పష్టం చేస్తున్నాయని ఆయన అన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీట మునిగి యువకుడి మృతి

చేగుంట(తూప్రాన్): జాతర కోసం అమ్మమ్మ ఊరికి వచ్చిన యువకుడు స్నానానికి చెరువులోదిగి మృతి చెందిన విషాద ఘటన మండలంలోని చందాయిపేటలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం.. మక్కరాజీపేటకు చెందిన బాలమణి, లక్ష్మణ్ దంపతుల కుమారుడు భానుప్రసాద్(17) హైదరాబాద్‌లోని తుకారాంగేట్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుకుంటున్నాడు. తండ్రి లక్ష్మణ్ మృతి చెందగా తల్లి బాలమణి ప్రైవేటు ఉద్యోగం చేస్తూ కుమారుడిని చదివిస్తోంది. మండలంలోని చందాయిపేటలో దుర్గమ్మ ఉత్సవాలు జరుగుతుండగా అమ్మమ్మ గారి ఊరిలో జాతర కోసం భానుప్రసాద్ వచ్చాడు. బంధువులతో కలిసి చెరువులో స్నానం కోసం దిగాడు. ఈతరాని భాను ప్రసాద్ నీటిలో గల్లంతయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని బయటకు తీసేసరికే మృతి చెందాడు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా వారు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ హరీశ్ తెలిపారు. భానుప్రసాద్ మృతితో గ్రామంలో విషాద చాయలు అలముకున్నాయి. బంధువుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.



భాను ప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

కేసీఆర్ పాలనలోనే తెలంగాణ అభివృద్ధి

తూప్రాన్: ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలోనే తెలంగాణ రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని రావెల్లి గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గజ్వేల్ నుంచి ముఖ్యమంత్రిగా మూడోసారి భారీ విజయం సాధిస్తారని తెలిపారు. ఇందుకోసం ప్రతీ ఓటరు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు సతీశ్‌చారీ, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పథకాలు

అల్లాదుర్గం(మెదక్): కాంగ్రెస్ పార్టీతోనే సంక్షేమ పథకాలు అమలవుతాయని అందోల్ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకురాలు త్రిష దామోదర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని వెంకట్‌రావుపేట, చిల్వెర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాదుర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దామోదర్ చేసిన అభివృద్ధి పనులే ఇప్పటికీ కనిపిస్తున్నాయన్నారు. అందోల్‌లో లింకు రోడ్లు, విద్య అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేసిందన్నారు. 10 ఏళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ ఏ అభివృద్ధి పనులు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు శేశారెడ్డి, సుభాశ్‌రావు, బల్‌రాం, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, నర్సింలు, నర్సింహరెడ్డి, చంద్రశేఖర్, సంగమేశ్వర్, మహేశ్, అంజాగౌడ్, రఘువీర్ పాల్గొన్నారు.

పశుగ్రాసం అందజేత



శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి ఆలయ గోశాలకు మంగళవారం దాత పశుగ్రాసం అందజేశారు. తూప్రాన్‌కు చెందిన ప్రముఖ వ్యాపారి సుజాతసిద్ధిరాంలు దంపతులు 300 ఎండు పశుగ్రాసం కట్టలు గోశాల నిర్వాహకులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. గోశాల నిర్వహణ దాతల సాయంతో జరుగుతుందని అన్నారు.

రూ.9.90 లక్షలు సీజ్

రామాయంపేట(మెదక్): రామాయంపేటలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం రాత్రి నగదు పట్టుకున్నారు. కే.శ్రీనివాస్ అనే వ్యక్తి కారులో ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 9.90 లక్షలు తరలిస్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

రూ.లక్ష నగదు పట్టివేత

మనోహరాబాద్(తూప్రాన్): ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద తనిఖీల్లో పోలీసులు రూ.లక్ష నగదు స్వాధీనం చేసుకున్నారు. మేడ్చల్‌కు చెందిన తోట వినీత్‌రాజ్ కారులో తరలిస్తున్న రూ లక్ష నగదును మంగళవారం స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీధర్, ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఆ నగదును గజ్వేల్ పీఎస్‌లో అందజేశామని, సరైన పత్రాలను చూపించి డబ్బు తిరిగి తీసుకోవచ్చని వారు తెలిపారు.

9న శిలాన్యాసం పత్రిక ఆవిష్కరణ

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో నిర్మించతలపెట్టిన దత్తాత్రేయ మహాస్వామి, సాయిబాబా ఆలయ నిర్మాణానికి సంబంధించి గురువారం పత్రిక ఆవిష్కరించనున్నట్లు శ్రీ గురుపీఠం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ శివకుమార్‌గౌడ్ తెలిపారు. డిసెంబర్ 7న బగలాముఖీ ఉపసకులు శాస్తుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో శిలాన్యాసం భగవాన్ విష్వయోగి విశ్వంజి మహారాజ్ ఆవిష్కరిస్తారని చెప్పారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోండి

నర్సాపూర్‌రూరల్: పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లోని సేవలను ప్రతి ఇంటింటి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని సంగారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ సంపత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ ఎంపీపీ సమావేశ మందిరంలో తపాలా సేవల సమీకృత సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారి అవసరాలకు అనుగుణంగా తపాల సేవలను విస్తరించాల్సిన ఆవశ్యకత ప్రతి ఒక్క తపాల ఉద్యోగిపై ఉందని అన్నారు. ఈ మేరకు వివిధ పోస్టల్ పథకాలపైన ఉద్యోగులు అవగాహన పెంచుకొని గ్రామీణ ప్రజలతో మమేకమై వారిని పొదుపు పథకాల్లో భాగస్వామ్యం చేయాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. పసికందు నుంచి సీనియర్ సిటిజన్స్ వరకు వివిధ పొదుపు స్కీములు, ఇన్సూరెన్స్ పథకాలు ఉన్నాయని చెప్పారు. ప్రతీ తపాలా ఉద్యోగి సేవా భావంతో అన్ని వర్గాల వారికి తపాల సేవలను విస్తరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి సబ్ డివిజన్ ఎంఓలు డి.శ్రీనివాస్, శంకర్, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌లు, ఏబీపీఎంలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారులు

ప్లాస్టిక్ లేని పండుగను జరుపుకోవాలి

- స్వచ్ఛ దీపావళిపై అవగాహన ర్యాలీ
- నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్

నర్సాపూర్: దీపావళి జాతీయ స్థాయి పండగని, ప్రజలు ప్లాస్టిక్ లేని పండగను జరుపుకోవాలని నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ అన్నారు. కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత మిషన్ – అర్బన్ కార్యక్రమాలను ఈనెల 6 నుంచి 12 వరకు స్వచ్ఛ దీపావళి – శుభ దీపావళి ప్రచారాన్ని చేపట్టాలని నిర్ణయించిందని చెప్పారు. అందులో భాగంగా మంగళవారం పట్టణంలో అవగాహన ర్యాలీ చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛ భారత్ ప్రయాణం, పర్యావరణం కోసం జీవనశైలి సూత్రాలతో పాటు దీపావళి పండగ సంస్కృతి ప్రాముఖ్యతను తెలియచేశామని అన్నారు. అందరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ లేని పండగను జరుపుకోవాలని ప్రజలను కోరారు. ర్యాలీలో కమిషనర్‌తో పాటు ఆఫీసు మేనేజర్ మధుసూదన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వెంకట్‌గోపాల్

పాఠశాలల్లో మాక్ పోలింగ్



పాపన్నపేట(మెదక్): మాక్ పోలింగ్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని యూసుఫ్‌పేట ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులే ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, ఎన్నికల ఏజెంట్లుగా వ్యవహరించారు. అఖిల, నితిన్ తేజ. రవితేజ అభ్యర్థులుగా పోటీ చేశారు. వీరికి ఎన్నికల గుర్తులు సైతం కేటాయించారు. ఈవీఎంలపై అవగాహన కల్పిస్తూ, ఓటును వినియోగించుకున్నారు. సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయులు సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలింగ్ కొనసాగింది. విద్యార్థులు, హెచ్‌ఎం మాలతీదేవి, టీచర్లు నర్సింలు, పద్మ, కనకయ్య, హీరాలాల్, శ్రీనివాస్, టీ.శ్రీనివాస్, అనసూయ, వినోద, సర్పంచ్ దాసయ్య పాల్గొన్నారు.



చిలప్‌చెడ్ (నర్సాపూర్): మాక్ పోలింగ్‌లో ఓటు వేస్తున్న చిన్నారి

చిలప్‌చెడ్ (నర్సాపూర్): ఎన్నికలు, ఓటింగ్ తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కలిగేందుకు మాక్ పోలింగ్ నిర్వహిచామని హెచ్‌ఎం నాగరాజు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిట్కుల్ ఉన్నత పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ పోలింగ్‌లో పాఠశాల విద్యార్థులు అభిషేక్, విశాల్, అక్షిత ఎన్నికల్లో పోటీదారులుగా ఉండగా, 130 ఓట్లలో, అభిషేక్ 36 ఓట్లతో విజయం సాధించాడు. ఈ సందర్భంగా హెచ్‌ఎం నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు మాక్ పోలింగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. కార్యక్రమంలో పాధ్యాయ సిబ్బంది ప్రభాకర్, విష్ణువర్ధన్, ధన్‌సింగ్ పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించండి

బీజేపీ అభ్యర్థి పంజా విజయ్‌కుమార్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలకు నిరంతరం సేవ చేసే బీజేపీని ఆదరించి తనను గెలిపించాలని మెదక్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పంజా విజయ్‌కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రం చిన్నశంకరంపేటలోని సోమేశ్వరాలయంలో పూజలు నిర్వహించి, ప్రచారం ప్రారంభించారు. చిన్నశంకరంపేట, రుద్రారం, చందంపేట, భాగీర్థపల్లి, సూరారం, ధరిపల్లి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన తనను ఆశీర్వదించి ఓటువేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పోగుల రాజు, బీజేపీ నాయకులు నందారెడ్డి, మల్లారెడ్డి, విజయ్, రాగి రాములు, గంగాధర్‌గౌడ్, వనం నర్సింలు పాల్గొన్నారు.

మండల స్థాయి జానపద పోటీలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి జానపద నృత్య పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా చేగుంట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు మండల స్థాయి విజేతలుగా నిలిచారు. ఈ ఆరు మంది విద్యార్థినులు జిల్లా కేంద్రమైన మెదక్‌లో బుధవారం నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం నీరజ తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అంజనేయులు, వెంకటేశ్, గైడ్ టీచర్ శారద, పలు పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఎన్నికల ప్రచారంతో విద్యార్థులకు ఇబ్బందులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఎన్నికల ప్రచార రథం పాఠశాల వద్ద ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. మంగళవారం మండలంలోని భుజిరంపేట ప్రాథమిక పాఠశాలవద్ద కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార రథకం అరగంట పాటు పాటలు పెట్టి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు పాఠశాల నుంచి బయటకు వచ్చి చూస్తు ఉండిపోయారు. పాఠశాల వద్ద ప్రచారం చేయడం ఏమిటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.



పాఠశాల వద్ద ప్రచార రథాన్ని చూస్తున్న విద్యార్థులు

పగిలిన పైపు.. మరమ్మతులు ఎప్పుడు?

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేట ప్రధాన రహదారి కమాన్ పక్కన రక్షిత మంచినీటి నుంచి వచ్చే ఓవర్ ఫ్లో పైప్‌లైన్ పగిలి వారంకు పైగా అవుతుంది. దీంతో పగిలిన పైపు నుంచి నీరు వృథాగా పోవడంతో పాటు గుంత పెద్దదిగా ఏర్పడి నిలిచిన నీరు తిరిగి చెత్తా చెదారంతో పాటు పైప్‌లైన్‌లోకి చేరుతుంది. అదే నీరు ప్రజలు తాగితే అనారోగ్యం పాలయ్యే పరిస్థితులున్నాయి. అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



పైప్‌లైన్ పగలడంతో ఏర్పడ్డ గొయ్యి